
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 42.0 కనిష్ఠం : 26.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 6 మే 2025

మద్యం ఎమ్మార్పీకి మంగళం..!

- సిండికేట్ ఏర్పాటు
- మూకుమ్మడిగా నిర్ణయం

- క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అదనం
- బీరుపైనా బాదుడు
- ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వసూలు
- బెల్ట్‌షాపుల నిర్వాహకుల నుంచి నెలకు రూ.50 వేలు వసూలు
- ఇష్టారాజ్యంగా పర్మిట్ రూమ్‌ల నిర్వహణ
- పట్టించుకోని ఎక్సైజ్ యంత్రాంగం





అనంతపురంలోని మద్యం దుకాణాల పక్కనే పర్మిట్ రూమ్ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, మే 5(ఆంధ్రజ్యోతి): 'బెల్టు షాపులు ఎక్కడైనా కనిపిస్తే తాట తీస్తాం.. అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. ఎమ్మార్పీలకే మద్యం విక్రయించాలి.. ఎవరు మద్యం నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవు' ఈ మాటలు నిత్యం అధికారులు, పాలకులు వల్లె వేస్తుంటారు. జిల్లాలో మద్యం విక్రయాల పరిస్థితి అందుకు భిన్నంగా కొనసాగుతోంది. మద్యం దుకాణాలు అత్యధికంగా పాలక పార్టీల ముఖ్యనేతల అనుచరవర్గాలవే. ఇంకా చెప్పాలంటే పాలక పార్టీల ముఖ్యనేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. మద్యం పాలసీకి అనుగుణంగా దుకాణాలు నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం. అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత ఎక్సైజ్ యంత్రాంగంపై ఉంది. జిల్లాలో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో ఆ శాఖ అధికారులు విఫలమయ్యారు. మాటలకు, చేతలకు పొంతన లేని పరిస్థితి కొనసాగుతోంది. ఇందుకు మద్యం దుకాణాల నిర్వహణే నిదర్శనం. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీలకు మంగళం పాడటమే ఇందుకు నిదర్శనం.

ఎక్సైజ్ అధికారులతో కుమ్మక్కు

జిల్లాలో మద్యం విక్రయాల్లో దుకాణాల నిర్వాహకులు ఎమ్మార్పీకి మంగళం పాడినా... అనుమతి లేకపోయినా పర్మిట్ రూమ్‌లు నిర్వహించినా.. బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మద్యం విక్రయాల్లో నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం వెనుక సంబంధిత అధికారుల్లో కొందరు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. బెల్టు షాపులు ఇంత పెద్ద ఎత్తున పెరగడానికి ఆ శాఖ అధికారుల సహకారమే కారణమని తెలుస్తోంది. ఒక్కో మద్యం దుకాణం పరిధిలో ఎన్ని బెల్టు షాపులు నిర్వహిస్తున్నా.. ఆ దుకాణం పరిధి నుంచి నెలకు రూ.50వేలు దాకా మామూళ్లు ముడుతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలు ఉన్నాయి. అధికారులకు అంతా తెలిసే జరుగుతోందన్న అభిప్రాయం ఉంది. మద్యం దుకాణాదారులు... అధికారులు కుమ్మక్కయిన నేపథ్యంలో నిబంధనల అమలు సాధ్యమేనా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా మద్యం విక్రయాల నిబంధనలు అమలయ్యే విధంగా జిల్లా ఉన్నతాధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో చూడాలి.

సిండికేట్‌కు శ్రీకారం..!

వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించిన నేపథ్యంలో మందుబాబుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. నకిలీ మద్యం, అధిక ధరలతో విసిగి వేసారిన మందు బాబులు వైసీపీ ప్రభుత్వాన్ని కూలదోయడంలో కీలకంగా వ్యవహరించారనే అభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో తిరిగి ప్రైవేటు వ్యక్తులకే మద్యం విక్రయాల నిర్వహణ పాలసీని తీసుకొచ్చారు. ఎమ్మార్పీకే నాణ్యమైన మద్యం విక్రయించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా మద్యం విక్రయాలు జరగాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలు... మద్యం విక్రయాల నిబంధన లు పాలక పార్టీల నే తలు ఒక్కొక్కటిగా పెడచెవిన పెడుతూ వస్తున్నారు. మద్యం దుకాణాల ప్రారంభ దశలో ఎమ్మార్పీలకే మద్యం విక్రయించారు. రోజులు గడిచే కొద్దీ నిబంధనలను ఉల్లంఘించడం మొదలు పెట్టారు. అనుమతి లేకపోయినా... అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు యథేచ్ఛ గా నిర్వహిస్తున్నారు. తర్వాత బెల్టు షాపుల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. తాజాగా ఎమ్మార్పీలకే మంగళం పాడుతూ సిండికేట్‌కు శ్రీకారం చుట్టారు. మద్యం విక్రయాల మాటున అక్రమార్జనకు తెరలేపడం చూస్తుంటే.. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా పాలక పార్టీల్లోని కొందరు నాయకులు వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది.

క్వార్టర్‌పై రూ.10 అదనం

జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 142 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. అనంతపురంలో 43, బుక్కరాయసముద్రంలో 15, గుత్తి 19, గుంతకల్లు 16, ఉరవకొండ 7, తాడిపత్రి 14, కణేకల్లు 6, రాయదుర్గం 10, కళ్యాణదుర్గం 8, కంబదూరులో 4 మద్యం షాపులు నడుస్తున్నాయి. వీటి పరిధిలో రెండువేలకు పైగా బెల్టుషాపులు నడుస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 142 మద్యం దుకాణాల పరిధిలో లిక్కర్, బీర్ల అమ్మకాలు నెలకు సగటున రూ.95 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. మద్యం విక్రయాలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో... వేసవిని దృష్టిలో ఉంచుకొని అదనపు బాదుడుకు దుకాణాల నిర్వాహకులు సిండికేట్ అయ్యారు. ఈ క్రమంలోనే క్వార్టర్ బాటిల్‌పై రూ.10 వసూలు చేయడం మొదలు పెట్టారు. బీర్లపైనా అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారు. ఇక ఫుల్ బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 అదనంగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు.. మ్యాన్‌సన్ హౌస్ క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీ రూ.200 ఉండగా... రూ.210 వసూలు చేస్తున్నారు. మ్యాన్‌సన్‌హౌస్ ఫుల్ బాటిల్ ఎమ్మార్పీ రూ.770 ఉండగా ఏకంగా రూ.800 వసూలు చేస్తున్నారు. ఇలా అన్ని రకాల బ్రాండ్లపైనా అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులు ఇష్టం వచ్చిన ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.20ల నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు.

గుంతకల్లు చెరువులకు నీరివ్వండి

మంత్రి కేశవ్‌కు సీపీఐ నేతల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

అనంతపురం విద్య, మే 5(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా నీరు సమృద్ధిగా అందించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సీపీఐ నాయకులు కోరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీశ్ తదితరులు మంత్రిని సోమవారం ఆయన నివాసంలో కలిశారు. హంద్రీనీవా నీరు గుంతకల్లు మీదుగానే వెళుతోందని, ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ ప్రాంతానికి సరిగా నీరు అందడం లేదని మంత్రికి వివరించారు. గుంతకల్లు నియోజకవర్గంలోని పాత కొత్త చెరువు, వైటీ చెరువుకు మాత్రమే నీరు అందుతోందని, కేవలం 1500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోందని తెలిపారు. గుంతకల్లు చుట్టుపక్కల ఉన్న పత్తికొండలో 11,,719 ఎకరాలకు, దేవనకొండ 45,396, వజ్రకరూరు 7,050, ఉరవకొండ 6,577, విడపనకల్లు 13,137, బెళుగుప్పలో 35,299 ఎకరాలకు నీటి కేటాయింపులు ఉన్నాయని తెలిపారు. రాగులపాడు వద్ద ఉన్న కాలువ నుంచి గుంతకల్లు మండలంలోని 15 చెరువులకు నీరు అందించే పథకానికి టెండర్లు పిలిచారని, ప్రభుత్వం భూసేకరణ చేయక, నిధులు ఇవ్వకపోవడంతో పనులు జరగడం లేదన్నారు. గుంతకల్లు ప్రాంత రైతులను దృష్టిలో ఉంచుకుని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మందాలప్ప, జయరాముడు, రాము, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఒక లైలా కోసం..!

భర్తకు దూరంగా ఉంటున్న ఓ మహిళను ఇద్దరు ప్రేమించారు. ఆమెను అమితంగా ఇష్టపడ్డారు. ఆమెకు మొదటి ప్రియుడు ఫోన్ చేయడం రెండో ఆయనకు నచ్చలేదు. దీంతో కిడ్నాప్‌కు ప్లాన్ చేశాడు. అపహరించి, వాహనంలో తరలిస్తుండగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇదే అదనుగా అతను తప్పించుకుని కిందకు దిగాడు. హడావుడి కావడంతో అనుమానం వచ్చిన ట్రాఫిక్ పోలీసులు.. అందరినీ పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతపుం క్లాక్ టవర్ సర్కిల్‌లో అడ్డం తిరిగిన ఈ డబుల్ లవ్ కం కిడ్నాప్ కథ వివరాలు ఇవి..

తాడిపత్రికి చెందిన ఆమెకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కారణమేమిటోగాని, కొంతకాలంగా ఒంటరిగా ఉంటోంది. ఆమెకు అనంతపురం ఆరో రోడ్డుకు చెందిన మురళి పరిచయమయ్యాడు. మొదట స్నేహం.. ఆ తరువాత సాన్నిహిత్యం పెరిగింది. కాలం సాఫీగానే సాగిపోతుండగా, కొన్ని నెలల క్రితం ఆమెకు ఇంకో వ్యక్తితో పరిచయమైంది. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించి.. గాఢంగా మారింది. అయినా 'తొలి పరిచయం' ఆమెను వీడలేకపోయింది. మురళి తరచూ ఆమెకు ఫోన్ చేస్తుండేవాడు. ఇది రెండో ప్రియుడికి నచ్చలేదు. అతన్ని కిడ్నాప్ చేయాలని ప్లాన్ వేశాడు. ఆమె చేత మురళికి ఫోన్ చేయించి, పిలిపించాడు. కళ్యాణదుర్గం రోడ్డులోకి రాగానే మరో ముగ్గురు వ్యక్తుల సాయంతో మురళిని సోమవారం సాయంత్రం కిడ్నాప్ చేశారు. ఓ వాహనంలో ఎక్కించుకుని ఎక్కడికో బయలుదేరారు. క్లాక్ టవర్ వద్దకు ఆ వాహనం రాగానే ట్రాఫిక్ జామ్ అయింది. అదే అదనుగా మురళి వాహనం దిగి తప్పించుకున్నాడు. అందులో ఉన్నవారు పట్టుకునేందుకు ప్రయత్నించారు. గొడవ జరుగుతున్నట్లు అనిపించడంతో ట్రాఫిక్ పోలీసులు వారిని పట్టుకుని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. ఆ సంఘటన జరిగిన ప్రాంతం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధికి వస్తుందని.. అక్కడికి పంపించారు. ప్రత్యేక పోలీస్ బృందం రెండో ప్రేమికుడిని, అతని ముఠాను అదుపులోకి తీసుకుని విచారిస్తోంది.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం



సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీశ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్

9న సీఎం చంద్రబాబు పర్యటన

ఏర్పాట్లపై ఆర్థికశాఖ మంత్రి కేశవ్ సమీక్ష

అనంతపురం అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 9న పర్యటిస్తున్నారు. హంద్రీనీవా విస్తరణ పనులను పరిశీలిస్తారు. వజ్రకరూరు మండంలోని ఛాయాపురంలో గ్రామ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం పరిశీలించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో మంత్రి సీఎం పర్యటన గురించి చర్చించారు.

(మరిన్ని వివరాలు 7లో..)

అవినీతి సామ్రాజ్యం..!

సామంత ఏలికల్లా ఏఈలు

డబ్బులిస్తేనే పని జరిగేది

ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట

కళ్యాణదుర్గం ట్రాన్స్‌కోకు అవినీతి చీడ



కళ్యాణదుర్గం సబ్‌డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయం



కళ్యాణదుర్గం, మే 5(ఆంధ్రజ్యోతి): కొందరి పనితీరు వల్ల కళ్యాణదుర్గం ట్రాన్స్‌కో కార్యాలయం అవినీతి సమ్రాజ్యంగా మారి పోయింది. ఇక్కడ పని చేసే కొందరు అవినీతి సామంతులు గా తయారయ్యారు. ఏళ్లతరబడి ఇక్కడే ఉంటూ అవినీతిని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. పక్క పక్క మండలాలకే బదిలీ చేయించుకుంటూ నియోజకవర్గాన్ని వదలకుండా ఉన్నారు. ఈ అధికారులను ప్రశ్నించేవారు లేకపోవడంతో అవినీతిలో యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. ఒక్కొక్కరికి రెండేసి మండలాల బాధ్యతలు అప్పగించడంతో వారి అక్రమార్జనకు అడ్డు లేకుండా పోతోంది. ఏవో కుంటిసాకులు చెబుతూ కొత్త అధికారులను ఇటువైపు రాకుండా చేస్తూ దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో కొనసాగించిన హవా నేటికీ తగ్గకపోవడంతో సామన్య ప్రజలు బేజారవుతున్నారు.

ఆ ఏఈ పేరు చెబితే హడల్

నియోజకవర్గ పరిధిలో పనిచేసే ఓ ట్రాన్స్‌కో ఏఈ పేరు చెబితే చాలు హడలి పోయే పరిస్థితి ఉంది. డబ్బులిస్తేనే పని చేస్తానంటూ బహిరంగంగా డిమాండ్ చేస్తారు. ట్రాన్స్‌ఫార్మర్లు కావాలన్నా, స్తంభాలు కావాలన్నా ఇతరత్రా ఏ పని జరగాలన్నా పైసలివ్వాల్సిందే. లేకుంటే ఇంచు కూడా ముందుకు సాగదు. అంతలా డబ్బులకు పీడిస్తాడనే ఖ్యాతి గడించాడు. ఈయన పనితీరుపై రైతులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయితే ఆ అధికారిపై అజమాయిషీ చేసే అధికారి ఏ ఒక్కరూ లేరు.

అతడు చేసిందే శాసనం

నియోజకవర్గంలోని ఓ మండలంలో పనిచేసే ఓ ట్రాన్స్‌కో ఏఈ ఎంత చెబితే అంత అనేలా ఆయన హవా సాగుతోంది. ఏ కార్యకలాపాలైనా ఆయన కనుసన్నల్లో జరగాల్సిందే. ఆయన చేసిందే శాసనం. ఏ ఉన్నతాధికారి ఉన్నా, ఆయనకు అత్యంత సన్నిహితంగా మారి పోయి తనకు అనుకూలంగా మార్చుకుంటారని శాఖలోని ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. వైసీపీ పాలనలో కూడా ఉన్నతాధికారికి అత్యంత సన్నిహితంగా ఉంటూ, మిగతా ఏఈలపై పెత్తనం చేశాడనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో కూడా అదేవిధంగా పై అధికారులను మలుచుకుని హవా నడుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పనులు చేయడానికి డబ్బులు డిమాండ్ చేయడంలో కూడా ఆ అధికారిది పెద్ద చెయ్యే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లక్షల్లో సంపాదన..!



ఇక మరో ఏఈలు కొన్నేళ్ల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే తిరుగుతూ లక్షలాది రూపాయలు వెనకేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ఇస్తే క్షణాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడంలో ఆయనకు తెలిసినంతగా మరే అధికారికి తెలియదు అన్నది బహిరంగ రహస్యం. కొన్నేళ్ల నుంచి ఇక్కడిక్కడే విధులు నిర్వహిస్తూ, అందిన కాడికి దోచుకుంటున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కాని ఏ ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకునే సాహసం చేయడం లేదు. దీంతో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటలాగా సాగిపోతోంది.

కాంట్రాక్టర్లే కల్పతరువు

ట్రాన్స్‌కోలో పనులు చేసే కొందరు కాంట్రాక్టర్లే ఏఈలకు కల్పతరువులుగా మా రారు. కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పని చేస్తున్నప్పటికీ ఏ ఒక్క ఏఈ కూడా వారిపై అజమాయిషీ చేయడం లేదు. డబ్బులిస్తున్నాం, మాకు నచ్చిన విధంగా పనులు చేసుకుంటాం...అన్న రీతిలో కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారు.

సంబంధిత అధికారులు స్పందించి కళ్యాణదుర్గం ట్రాన్స్‌కో కార్యాలయంలో పేరుకుపోయిన అవినీతి మకిలీని తుడిచి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇక్కడకు వచ్చేవారే లేరు

కళ్యాణదుర్గం డివిజన్‌కు ట్రాన్స్‌కో ఏఈలుగా వచ్చే వారే లేరు. కళ్యాణదుర్గం డివిజన్ అంటే వెనకడుగు వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్నవారితోనే పనులు చేయించుకుంటున్నాం. ఎక్కడైనా ఏఈలు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేస్తే వారిపై శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, ట్రాన్స్‌కో డీఈ, కళ్యాణదుర్గం డివిజన్

పెద్దారెడ్డి అరాచకాలు కనిపించలేదా..?

జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కక్షసాధింపు రాజకీయాలు, అరాచకాలు మేధావులకు కనిపించలేదా అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ల మీద కేసులు బనాయించారని, మున్సిపాలిటీ అభివృద్ధికి ఆటంకాలు కలిగించారని, తనమీద 138 కేసులు, తన కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి మీద 56 కేసులు, తన భార్య ఉమాదేవిపై 36 కేసులు, కోడలిపై ఈడీ కేసు బనాయించారని అన్నారు. 1952 నుంచి తాము రాజకీయం చేస్తున్నామని, కానీ ఫ్యాక్షన్ రాజకీయాలు చేయలేదని అన్నారు. గతంలో తన తండ్రి నాగిరెడ్డి, సోదరుడు దివాకర్ రెడ్డితో పాటు తనమీద ఎంతమంది పోటీచేసినా ఎన్నికల్లో మాత్రమే రాజకీయం చేశారని, వ్యక్తిగతంగా కక్షసాధింపులకు పాల్పడలేదని అన్నారు. అప్పటి డీఎస్పీ చైతన్యను పెద్దారెడ్డి తన ఇంటిమీదకు వచ్చారని, తన ఇంట్లోకి ప్రవేశించి తన కుటుంబ సభ్యులను అసభ్యంగా దూషించిన విషయం ఇప్పుడున్న మేధావులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కోర్టు తీర్పులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అప్పట్లో తాడిపత్రికి వచ్చేందుకు రవికి కోర్టు పర్మిషన్ ఇచ్చినా పట్టించుకోని అధికారులు ఏమయ్యారని నిలదీశారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ రకరకాలుగా మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేస్తోందని అన్నారు. పెద్దారెడ్డి అరాచకాల గురించి మేధావులు ప్రశ్నించాలని, ఆయనకు వత్తాసు పలకడం మంచిదికాదని అన్నారు. గతంలో జరిగిన అన్యాయాలపై అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, గుంతకల్లు వెంకటరామిరెడ్డి.. ఇలా ఎవరు మాట్లాడినా సమాధానం చెబుతానని, అన్ని ఆధారాలు చూపిస్తానని అన్నారు.

కంచె కుదింపు?

పుట్లూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోమటికుంట్లలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భూములకు ఉన్న కంచెను రెవెన్యూ అధికారులు కుదించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. పెద్దారెడ్డి కొనుగోలు చేసిన భూముల్లో కొంతమేర ప్రభుత్వ భూమి ఉందని ఫిర్యాదు వెళ్లడంతో గత నెలలో రెవెన్యూ అధికారులు దగ్గరుండి భూములు సర్వే చేశారు. సుమారు ఒక ఎకరం ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఆ మేరకు పెద్దారెడ్డి భూములకు ఉన్న కంచెను సోమవారం లోపలకు కుదించినట్లు తెలిసింది. తోట లోపలికి ఎవరినీ రానివ్వకుండా కంచె కుదించినట్లు సమాచారం. వివరణ కోరేందుకు తహసీల్దార్ శేషారెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా, స్పందించలేదు.

పంట ప్రాణాలు..!



రాయలచెరువు వద్ద అరటి మొక్కలకు రక్షణగా ఏర్పాటుచేసిన ఈత ఆకులు

యాడికి, మే 5(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు పంటలంటే ఆదాయాన్నిచ్చే వనరులే కాదు, పంచప్రాణాలు కూడా. భూమినే నమ్ముతాడు. సర్వశక్తులూ ఒడ్డుతాడు. అష్టకష్టాలు పడతాడు. అణుక్షణం పంటను కాపాడుతూనే ఉంటాడు. చీడపీడలు సోకకుండా రక్షిస్తూనే ఉంటాడు. మండే ఎండలో లేత అరటి పిలకలను చూసి రైతు గుండె తరుక్కుపోయింది. ఈత ఆకులను తెచ్చి, వాటికి రక్షణగా ఏర్పాటు చేశాడు. లేలేత టమోటా మొక్కల కోసం తాటి ఆకులనే తెచ్చాడు. అలా పంటల పరిరక్షణకు ఎన్నెన్నో ఉపాయాలు చేస్తున్నాడు. అవన్నీ ఫలించాలనీ, అన్నదాత ఆశల పంట పండాలని ఆకాంక్షిద్దాం.

ఐడియాలు అదుర్స్..

మండలంలో అరటిమొక్కలు నాటిన రైతులు వాటికి నీడ కల్పించేందుకు, కుందేళ్ల నుంచి రక్షించుకునేందుకు ఈతాకును ఉపయోగిస్తున్నారు. అరటి మొక్కలకు రెండువైపులా ఈత కొమ్మలను నాటుతున్నారు. దీంతో ఈతాకుకు డిమాండ్ ఏర్పడింది. గుంతకల్లు మండలం నాగసముద్రం, నంద్యాల జిల్లా అవుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఈతాకు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఒక్కో ఈత కొమ్మ కోసం నాలుగు రూపాయల వరకు వెచ్చిస్తున్నారు. టమోటా మొక్కలకు ఎండ నుంచి నీడను కల్పించేందుకు, పూత, పిందెలను పక్షులు తిని నాశనం చేయకుండా కాపాడుకునేందుకు కోనుప్పలపాడు గ్రామ రైతులు తాటాకు ఏర్పాటుచేశారు. దీన్ని గమనించిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తులు నిల్

అనంతపురం అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీ నోటిఫికేషన్ జారీ చేసిన మద్యం షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. గత నెల 24న తాడిపత్రిలోని 3 మద్యం షాపులు, కళ్యాణదుర్గంలో ఒక మద్యం షాపునకు ఎక్సైజ్ శాఖ రీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. నాలుగు మద్యం షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించినా రాజకీయ కారణాలతో ప్రారంభించలేదు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



వేణుగోపాల్ (ఫైల్)

నల్లమాడ, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవంకపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేణుగోపాల్(47) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేణుగోపాల్ ఆదివారం ఉదయం గోరంట్లలో ఓ వివాహానికి ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి బయల్దేరారు. ఓబుళదేవరచెరువు మండలంలోని గౌరాపురం వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పండింది. ప్రమాదంలో వేణుగోపాల్ తలకు బలమైన గాయమైంది. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. అనంతపురం ఆసుపత్రిలోనే వేణుగోపాల్ మృతదేహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. వేణుగోపాల్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అసభ్యకరంగా బాలిక ఫొటోలు

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికను గుట్టకిందపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడు అసభ్యకరంగా సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. దీంతో రూరల్ పోలీసులు పోక్సో చట్టంకింద కేసు నమోదు చేశారు. సోమవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుట్టకిందపల్లికి చెందిన నరసింహులు అనే యువకుడు పెయింటింగ్ పనిచేసేందుకు పట్టణ సమీపంలోని ఓ గ్రామంలోకి వెళ్లాడు. అక్కడ సమీపాన నాలుగేళ్ల బాలికను పిలిచి అసభ్యకరంగా ఫొటోలు తీశాడు. దీనిని గమనించిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక తల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు నరసింహులుపై పోక్సో కింద నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నరసింహులు పరారీలో ఉన్నాడు.

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు



సీజ్ చేసిన పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు సోమవారం ఉమ్మడి జిల్లాలో దాడులు నిర్వహించారు. గాండ్లపెంటలోని పీరాసాహెబ్‌కు చెందిన ఎఫ్‌పీ షాపును తనిఖీ చేశారు. అధికంగా స్టాకు ఉన్నట్లు గుర్తించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. నిల్వలను జప్తు చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, గాండ్లపెంట ఆర్ఐ అశోక చక్రవర్తి పాల్గొన్నారు. సీఐ జమాల్‌బాషా ఆధ్వర్యంలో గార్లదిన్నె మండలంలోని తలగాసిపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఉన్న 315 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌చేశారు. కేసు నమోదు చేసుకొని స్థానిక సీఎస్‌డీటీ హరిప్రియకు అప్పగించారు. బియ్యం యజమాని చింతలయ్య, డ్రైవర్ అక్బర్ బాషా, క్లీనర్ సుబ్బరాయుడును అదుపులోకి తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ జమాల్ బాషా తెలిపారు. తనిఖీల్లో ఏఈఈ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్15, 19) సప్లిమెంటరీ నిర్వహించామన్నారు. ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు తృతీయ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ పరీక్షలు పెట్టామన్నారు. వాటి ఫలితాలను విడుదల చేశామన్నారు. విద్యార్థులు ఫలితాలకోసం https://jntuaresults.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శివకుమార్, అసిస్టెంట్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ శంకరశేఖర్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

ఒంగోలు క్రైం, మే5 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్, ఇళ్లలో దొంగతనాలు చేయడంలో అందెవేసిన ముఠాను ప్రకాశం పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. దొంగతనం చేసి కారులో వెళుతుండగా, ఆపే ప్రయత్నం చేసిన ఎస్ఐ జీపునే ఢీకొట్టి తప్పించుకున్న ముఠా అది. నిందితులనుంచి రూ.85లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, ఆరు కిలోల గంజాయి, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా ఇటీవల ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం, అన్నమయ్య జిల్లాలో 16 చోట్ల దొంగతనాలు చేసిందని ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. నిందితులలో కడప జిల్లాకు చాపాడు మండలం ఖాదర్‌పల్లికి చెందిన భీమపర్తి ఫక్రుద్దీన్ అలియాస్ పోగోడు, అలియాస్ బొండ్డాడు, ఇంకా చింపర్తి అలియాస్ సింపతి మహబూబ్ పీరా, ప్రొద్దుటూరుకు చెందిన గాండ్ల లతీఫ్ బాషా ఉన్నారు.

'అనంత'పై సీఎంకు ప్రత్యేక శ్రద్ధ

- రెట్టింపు నీటిని తీసుకురావడానికి చర్యలు
- 9న ఉరవకొండలో చంద్రబాబు పర్యటన
- ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- కలెక్టర్, ఎస్పీతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, కలెక్టర్, ఎస్పీ

ఉరవకొండ, మే 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ఈ రోజు కళ్ల ముందు అది కనిపిస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం చిన్నముష్టూరు, చాయాపురం గ్రామాల వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఛాయాపురంలో సీఎం పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, గ్రామసభ జరిగే ప్రదేశాలను కలెక్టర్, ఎస్పీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 9వ తేదీన సీఎం ఉరవకొండ నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారని తెలిపారు. సీఎం పర్యటనకు సంబంధించి చిన్నముష్టూరు, చాయాపురం గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించామన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో సామర్థ్యాన్ని పెంచి, రెట్టింపు స్థాయిలో నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. జూలై 10వ తేదీలోపు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. గత పాలకులు ఎక్కడా నిర్మాణాలు కట్టకుండా కేవలం ఒక పంపుతో నీటిని హడావుడిగా విడుదల చేస్తే.. టీడీపీ హయాంలో అప్పటి జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమాను తీసుకువచ్చి.. ఆరు పంపులతో నీటిని తీసుకెళ్లిన ఘనత తమదే అన్నారు. ఏ గ్రామం వద్ద పనులు జరుగుతున్నాయో అక్కడే గ్రామ సభ ఉంటుందన్నారు. ఆ గ్రామంలోని మహిళలు, యువకులతో సీఎం మాట్లాడతారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, ఆర్ అండ్‌బీ ఎస్ఈ రాజ్‌గోపాల్, తహసీల్దార్లు మహబూబ్‌బాషా, నరేష్, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మండల కన్వీనర్లు నూతేటి వెంకటేష్, విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ టీడీపీ నాయకులు నాగేంద్ర, యర్రగుంట్ల వెంకటేష్, నాగన్న, ముష్టూరు రాంబాబు, ఎర్రిస్వామి, అనంతయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు ప్రజలకు వరం

- కొనసాగించేలా ఉద్యమిద్దాం ● అఖిలపక్ష కమిటీ పిలుపు



రిలేదీక్షలో మాట్లాడుతున్న సాకే హరి, మద్దతు తెలిపిన నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): రూరల్ డెవప్‌మెంట్ ట్రస్ట్ జిల్లా ప్రజలకు వరమని, ఆ సంస్థ సేవలను కొనసాగించేలా సమన్వయంతో ఉద్యమిద్దామని ప్రజా సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద సోమవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నిరుపేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్ఏ) అనుమతి కొనసాగించాలని కోరుతూ కమిటీ కన్వీనర్ సాకే హరి అధ్యక్షతన రిలే దీక్షలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజగోపాల్, జర్నలిస్టు నాయకుడు మచ్చా రామలింగారెడ్డి తదితరులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నివాస గృహాలు, ఆహారాన్ని అందించాలని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్డీటీని ప్రారంభించారని, విద్య, వైద్యం కూడా తప్పనిసరిగా భావించి విదేశీ దాతల సాయాన్ని ఆర్జించి సేవలను విస్తరించారని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ రూ.వందల కోట్లు వెచ్చించి అధునాత భవనాలను ఆర్డీటీ నిర్మించిందని గుర్తు చేశారు. ఆర్డీటీ సేవలను కొనసాగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామకృష్ణ, గంగాధర్, కేపీ రాజు, రామన్న, సుగమంచి శ్రీనివాసులు, బాలపెద్దన్న, టీపీ రామన్న, ఐఎంఎం బాషా, ఆనంద్, హరినాథ్‌రెడ్డి, వంశీకృష్ణ, రామాంజినేయులు, కృష్ణారెడ్డి, గోవర్ధన్, సూర్యనరాయణ, కాటమయ్య, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరంగనాథ వైభవం నాటిక

పుట్టపర్తి, మే 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం భక్తులు చేపట్టిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపచేశాయి. సోమవారం సాయంత్రం సాయి కుల్వంతు సభామండపంలో సాయియువత శ్రీరంగనాథవైభవం నాటికను ప్రదర్శించింది. పాత్రధారులు నాటికలోని ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ సేవాసంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు సేవా కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. రాత్రి పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. ప్రశాంతి నిలయం గేటు వరకు నగర సంకీర్తన సాగింది. కోలాటం, చెక్క భజన, భక్తిపాటలతో వేలాది మంది శ్రీకాకుళం భక్తులు పాల్గొన్నారు.



నాటికలోని సన్నివేశాలు

వర్సిటీలకు దండిగా నిధులు..!

- ఏడాదికి సరిపడా జీతభత్యాలు
- ఎస్కేయూకు రూ.100 కోట్లు, జేఎన్టీయూకు రూ.58.97 కోట్లు మంజూరు
- ఉద్యోగుల హర్షం



జేఎన్టీయూ ముఖద్వారం

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత వర్సిటీల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమకావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన నిధులను మంజూరు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న వర్సిటీలకు రూ.1200 కోట్లు నిధులు మంజూరు చేయగా.. అందులో ఎస్కేయూకు రూ.100 కోట్లు, జేఎన్టీయూకు రూ.58.97 కోట్లు కేటాయించింది. ఉద్యోగుల ఖాతాల్లో శనివారం జీతాలు జమ అయ్యాయని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఎదురుచూపులకు స్వస్తిచెబుతూ ఈ నెల 3వ తేదీనే ఖాతాల్లో జీతాలు జమకావడం ఆనందంగా ఉందని వర్సిటీల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్రైమాసికం వారీగా నిధుల మంజూరు వివరాలు రూపాయల్లో...

త్రైమాసికం	జేఎన్టీయూ	ఎస్కేయూ
ప్రథమ	20,64,07,950	35,04,87,550
ద్వితీయ	11,79,47,400	20,02,78,600
తృతీయ	11,79,47,400	20,02,78,600
నాల్గవ	14,74,34,250	25,03,48,250
మొత్తం	58,97,37,000	100,13,93,000

త్రైమాసిక కేటాయింపులు విడుదల

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో వర్సిటీలకు కేటాయించిన నిధులను మూడు నెలలకు కలిపి త్రైమాసికానికి(క్వార్టర్లీ) ఒకసారి ఆర్థిక శాఖ విడుదల చేస్తుంది. ఈ నిధులు నెలనెలా జీతాల కింద ఉద్యోగులకు జమ అవుతాయి. ఇలా సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలకు మొత్తం నిధులు విడుదలయ్యేవి. గతంలో కేటాయించిన నిధులను సకాలంలో మంజూరుచేసేవి. వైసీపీ పాలన ఐదు సంవత్సరాల్లో మాత్రం వర్సిటీల చరిత్రలో ఎన్నడూలేని విధంగా జీతాల నిధులకు కోతపెడుతూ వచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించినా అవి పేపర్లకే పరిమితమయ్యేవి. ప్రభుత్వానికి వెసులుబాటు కలిగినప్పుడు కొత్త మొత్తం జమచేస్తూ వచ్చేది. దీంతో నెలల తరబడి జీతాల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని వర్సిటీ ఉద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు.

ఏడాదికి సరిపడా జీతభత్యాలతో హర్షం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆర్థిక అంశాల్లోనూ సానుకూల వాతావరణం నెలకొంది. 2025-26 బడ్జెట్ కేటాయింపుల వారిగా నిధులు మంజూరు కావడం ఇందుకు నిదర్శనమని వర్సిటీల ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఏడాదికి సరిపడా జీత, భత్యాల నిధులను మంజూరు చేశారు. అందులో నుంచి మొదటి త్రైమాసికం (ఏప్రిల్, మే, జూన్) మొత్తాలు ఎస్కేయూకు రూ.35.04 కోట్లు, జేఎన్టీయూకు రూ.20.64 కోట్లు విడుదలయ్యాయి. మిగిలిన మొత్తాలు ఆయా త్రైమాసికాల వారిగా కేటాయించిన విధంగా విడుదలవుతాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.



ఎస్కేయూ ముఖద్వారం

ఎదురు చూడాల్సిన అవసరం లేదు

ఈ ఆర్థిక సంవత్సరంలో జీతాల కోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వం సరిపడా నిధులను మంజూరు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన జీత, భత్యాల నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రతి నెలా అడ్వాన్స్ నిధుల కోసం లేఖలు రాసి ఎదురు చూడాల్సి వచ్చేది. రెండు, మూడు నెలలకు ఒకసారి విడుదలయ్యేవి. దీంతో చిరుద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నిధులు ఇంకా రావాల్సివుంది. అవికూడా విడుదలైతే పూర్తిస్థాయిలో జీత, భత్యాల సమస్యలు తొలగిపోయినట్టే.

-ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డాక్టర్ రమేష్‌బాబు, జేఎన్టీయూ, ఎస్కేయూ రిజిస్ట్రార్లు

అతిథులు ఖరారు

- డాక్టర్ సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్
- ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్
- 17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

అనంతపురం సెంట్రల్, మే 5(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవ గౌరవ డాక్టరేట్‌కు హైదరాబాద్ లారస్ ల్యాబ్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ, ముఖ్య అతిథిగా ఐఐటీ కాన్పూర్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్ నారాయణ పేర్లు ఖరారయ్యాయి. గవర్నర్ నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సోమవారం తెలిపారు. ఈ నెల 17న జేఎన్టీయూ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

డాక్టర్ సత్యనారాయణ ఎవరంటే..



ఆంధ్రా యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగం పీహెచ్‌డీ పూర్తిచేసిన డాక్టర్ సత్యనారాయణ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి ఎంబీఏ పట్టాను పొందారు. పరిశోధనాభివృద్ధి, అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ప్రక్రియ, తయారీ, నాణ్యత నియంత్రణ, వ్యాపారాభివృద్ధి, సప్లై చైన్, మేధో సంపత్తి రంగాల్లో ఆయన 30 సంవత్సరాలు అనుభవాన్ని ఘడించారు. ఫార్మసీ రంగంలో 150 పేటెంట్స్‌ను సొంతం చేసుకున్నారు. స్వదేశంతోపాటు విదేశాల్లోనూ సేవలందిస్తూ కొత్త రకం ఔషధాలను కనుకున్నారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి పలు రూపాల్లో ఉచిత సేవలు అందించారు.

అంతర్జాతీయ పరిశోధకుడు మాధవ్



సివిల్ ఇంజనీర్‌గా ప్రొఫెసర్ ఎంఆర్ మాధవ్ 1960లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీటెక్‌లో పట్టుభద్రులయ్యారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) నుంచి ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఐఐటీ కాన్పూర్‌లో అధ్యాపక జీవితాన్ని ప్రారంభించారు. ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, బెల్జియం, యూకే తదితర దేశాల్లోని యూనివర్సిటీల్లో సేవలు అందించారు. జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో 30కిపైగా డాక్టోరల్, మాస్టర్ థీసీస్‌లు సొంతం చేసుకున్న ప్రాజెక్టులకు గైడ్‌గా వ్యవహరించారు. అంతర్జాతీయ పరిశోధకుడిగా గుర్తింపు పొందారు. హైదరాబాద్ జేఎన్టీయూలో జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో పరిశోధనా కళాశాలను స్థాపించారు. ఐఐటీ ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొంది, హైదరాబాద్ జేఎన్టీయూలో ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

నిర్ధేశించిన రుసుమే వసూలు చేయాలి

- ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఉంచాల్సిందే
- లైసెన్స్‌డ్ సర్వేయర్లకు డీపీఓ ఆదేశాలు



లైసెన్స్‌డ్ సర్వేయర్లతో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారిక, అనధికారిక లేఅవుట్స్, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. సోమవారం డీపీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఉంచాల్సిందే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనధికార లేఅవుట్స్‌కు సంబంధించి కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శులు భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో ఉండేలా చూడాలన్నారు. తనిఖీల్లో లోపాలు వెలుగులోకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ హరీష్‌తో పాటు లైసెన్స్ సర్వేయర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

13న మెగా జాబ్‌మేళా: మంత్రి సవిత



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి సవిత, టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావుతో కలిసి మెగా జాబ్‌మేళాలకు సంబంధించిన పోస్టర్లను మంత్రి సోమవారం విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 50కిపైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 2వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. వివరాలకు 9966682246, 9398811689 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో వాసవీమాత నగర సంకీర్తన



పాతూరులో నగర సంకీర్తన చేస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): వాసవీమాత జయంతిని పురస్కరించుకుని పాతూరు ఆర్యవైశ్య సంఘం, వాసవీ భజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగర సంకీర్తనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవీమాత చిత్రపటంతో పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పాతూరు వీధుల్లో వాసవీమాత భక్తిగీతాలాపన చేస్తూ ముందుకు సాగారు. పాతూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు, వాసవీ భజన మండలి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

అనంతపురం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్స వాలను స్థానిక పాతూరు రాణినగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మంగళ, బుధ వారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుర్లపల్లి రంగాచారి సోమవారం ఓ ప్రకటన లో వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాతసేవ, 6 గంటల నుంచి కలశస్థాపన, గణపతిపూజ తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. బుధవారం స్వామికి విశేష పూజలతోపాటు మధ్యాహ్నం అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. సాయంత్రం ప్రత్యేకరథంపై నగరోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

రేపు ముత్యాలమ్మ జాతర

రామగిరి, మే 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన రామగిరిలో బుధవారం ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం అమ్మవారిని గ్రామానికి తీసుకొస్తామన్నారు. బుధవారం అమ్మవారికి వడిబియ్యం ఇచ్చి ఊరేగింపుతో తిరిగి పంపనున్నట్టు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో బంధువులు, ఆడబిడ్డలతో సందడి నెలకొంది.

ఏడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లకు సన్మానం



ఏడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లను సన్మానిస్తున్న బుగ్గయ్య చౌదరి

అనంతపురం అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి ఘనంగా సన్మానించారు. సోమవారం అనంతపురంలోని తన నివాసంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్‌తో కలిసి ఇద్దరు చైర్మన్లకు శాలువాలు కప్పి, పూల మాలలు వేసి ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సరిపూటి రమణ, కూచి హరి, కృష్ణకుమార్, వెంకటేశ్వరరెడ్డి, మణికంఠ బాబు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయికి జాతీయ సేవారత్న పురస్కారం

అనంతపురం కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ జాతీయ సేవారత్న పురస్కారం అందుకున్నారు. ముంబైకి చెందిన సున్యాసే శిఖర్ ఫౌం డేషన్ వారు ఇటీవల వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని జాతీయ సేవారత్న పురస్కారాలకు ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా తరఫున విజయసాయికుమార్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. ఇటీవల ముంబైలో నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ సభకు విజయసాయి వెళ్లలేకపోయిన నేపథ్యంలో పురస్కారాన్ని కొరియర్ ద్వారా అనంతపురం పంపారు. దీంతో సోమవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో విజయసాయికుమార్ కు పురస్కారం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సిరి సంస్థ చంద్రకాంత్‌నాయుడు, సాయిట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

నార్పల, మే 5(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష ఫలితాలపై నార్పల-1 రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతు సేవా సహకార సంఘం, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా భూసారపరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ... పంటలు సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం నార్పల గ్రామానికి చెందిన 30 మంది రైతుల పొలాల్లో మట్టి నమోనాలను సేకరించారు. మండల వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి, రైతు సేవా సహకార సంఘం ప్రత్యేకాధికారి సుజన, సీఈఓ భవాని, ప్రసాద్‌రెడ్డి, హరి, రామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: ప్రతి రైతు తన పొలంలో భూ సార పరీక్షలు చేయించి, అందుకు అనుగుణంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని ఏఓలు శ్రీనాథ్, అన్వేష్‌కుమార్ తెలిపారు. వారు సోమవారం శింగనమల సహకార సొసైటీ కార్యాలయంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సహకార సొసైటీ సీఈఓ నారాయణస్వామి, ఆయకట్టు అధ్యక్షుడు బోయ సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'కాలువ నీరు దిగువకు వెళ్లేలా చర్యలు'



కాలువను పరిశీలిస్తున్న ధర్మవరపు మురళి తదితరులు

రాప్తాడు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మేపర్తి చెరువులో నుంచి పండమేరు వంకలోకి వెళ్లే నీరు గ్రామంలోకి, ఆశ్రమంలోకి రాకుండా సులువుగా దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం బొమ్మేపర్తి గ్రామానికి వెళ్లి ఆశ్రమం వద్ద కాలువ, తూములను పరిశీలించారు. కాలువలో రోడ్డుపై ఉన్న తూములు చిన్నవిగా ఉండటం వలన నీరు దిగువకు వెళ్లడంలేదన్నారు. నీరు సులువుగా దిగువకు వెళ్లేలా త్వరలోనే ఏర్పాట్లు చేస్తామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ శీనా పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కారం చూపాలి

● అధికారులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సూచన



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణ శర్మ, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, మే 5(ఆంధ్రజ్యోతి): అవే అర్జీలు పునరావృతం కాకుండా న్యాయమైన పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అధికారులకు సూచించారు. శింగనమల నియోజకవర్గం లోని బుక్కరాయ సముద్రం పంచాయతీ పరిధిలో చెరువు కట్ట వద్ద ఉన్న శ్రీ షిర్డీసాయి కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 525 వినతులు అందాయి. ఈ కార్యక్రమానికి హాజరైన జా యింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, డీఆర్వో మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా వ్యవసాయాధికారి ఉ మా మహేశ్వరమ్మ తదితర ముఖ్య అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్జీదారుడు సంతృప్తి చెందేలా సంబంధిత శాఖ అధికారులు ప్రతి సమస్య పరిష్కారం పట్ల చొరవ చూపాలన్నారు. భూ సమస్యలు, ఇంటి పట్టాలు, భూమి రస్తా విషయాలు, రీ సర్వేలో జరిగిన తప్పులపై ఎక్కువ అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వేసవి కాలం కావడంతో పలు చోట్ల తాగునీటి సమస్యపై అర్జీలు ఇచ్చారని తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలోని రెడ్డిపల్లి, కేకే ఆగ్రహారం, గోవిందంపల్లిల్లో ఎస్సీల శ్మశాన వాటిక స్థలం కోసం వినతుల అందజేశారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇప్పించండి: టీడీపీ నాయకులు

శింగనమల నియోజకవర్గంలో అకాల గాలి, వర్షం దాటికి పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆ మండలాల టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దెబ్బతిన్న పంటల వివరాలును లెక్కించి సీఎంకు విన్నవిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి : బీకేఎస్ మహిళలు

ప్రతి యేటా వేసవి వచ్చిందంటే తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటోందని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని బుక్కరాయసముద్రం కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల్లో పరిష్కరి స్తామని అధికారులు వారికి హామీ ఇచ్చారు.

నా భూమి నాకివ్వలేదు: దళిత మాజీ సర్పంచ్

టీడీపీకి చెందిన వాడిననే కారణంతో గతంలో ప్రభుత్వం తనకు కేటాయించిన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారని బుక్కరాయసముద్రం మండలంలోని చెదళ్ల గ్రామానికి చెందిన దళిత మాజీ సర్పంచ్ గుర్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ వచ్చినా అధికారులు ఆన్‌లైన్‌లోకి ఎక్కించలేదన్నారు. సర్వేనెం బరు 10లో 4.31 సెంట్ల భూమికి 2019లో ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో తొలిగించారని ఫిర్యాదు చేశరు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి : దళిత సంఘాలు

కొర్రపాడు గురుకల పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అవినీతిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నేతలు చిన్నాంజినేయులు తదితరులు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని జేసీ తెలిపారు.



పరిష్కార వేదికకు పోటెత్తిన ఫిర్యాదుదారులు

ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలి

● ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని ఏపీటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అసంబద్ధ నిర్ణయాలపై సోమవారం ఆ సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ... ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మోడల్ ప్రైమరీ, బేసిక్ స్కూళ్లను కొనసాగించాలని, అప్పర్ ప్రైమరీ స్కూళ్లను సైతం నడపాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీని 2023 జులై నుంచి అమలు చేయాలని కోరారు. ఇప్పటికే ఆలస్యమైందని, వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. అదేవిధంగా ఇతర టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తర్వాత ఎమ్మార్వోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌కుమార్, నరేష్ కుమార్, సర్దార్‌వలి, వెంకటరమణ, గురురాజ్, ఓబులేసు, సూర్యనారాయణ,ఎల్లప్ప, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నాగేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 5(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పూర్వపు నేత నాగేంద్ర ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి ఆ సంఘం నాయకులు, టీచర్లు రూ. 2 లక్షలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. సోమవారం ఉపాధ్యాయభవన్‌లో నాగేంద్ర సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. తర్వాత ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఉద్యమాల్లో నాగేంద్ర సేవలను కొనియాడారు. తర్వాత రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుధాకర్, అనిల్, రమణయ్య, సరళ, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ప్రమీల, అర్జున్, అబ్దుల్, సుబ్బరాయుడు, జిలాన్, కోటేశ్వరప్ప, పలు సంఘాల నేతలు సావిత్రి, ఈశ్వరయ్య, సాయినాథ్, ప్రభాకర్, ఓబుళపతి, బాలకృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె-కోటంక రోడ్డు నిర్మించాలి

● టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య వినతి

గార్లదిన్నె, మే 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గార్లదిన్నె నుంచి కోటంక వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యకుడు ఆవుల క్రిష్ణయ్య కోరారు. బుక్కరాయసముద్రం పంచాయతీ పరిధిలోని షిర్డీసాయి కల్యాణ మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, టీడీపీ మాజీ కన్వీనర్ గోరకాటి వెంకటేష్ వినతిపత్రం అందజేశారు. గార్లదిన్నె నుంచి కోటంక వరకు సుమారు 10 కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయ మైం దని తెలిపారు. అదేవిదంగా ప్రస్తుత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు చీనీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉద్యాన శాఖ అధికారులు మర్తాడులో కాకుండా జంబులదిన్నె, కనుంపల్లి గ్రామాల వద్ద స్థల సేకరణ చేస్తున్నారని వివరించారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల వినతి

శింగనమల, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మేపల్లి పంచాయతీకి వచ్చే మూడు రోడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కార్యనిర్వహక కార్యదర్శి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి విన్నవించారు. బుక్కరాయసముద్రం పంచాయతీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గుమ్మేపల్లి పంచాయతీ సమస్యలపై ఆయన వినతి పత్రం అందజేశారు. కల్లుమడి - గుమ్మేపల్లి రోడ్డు, గుమ్మేపల్లి-పాపినేపాళ్యం బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. అలాగే ఏకులనాగేపల్లి - గుమ్మేపల్లి మూడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ఏకులనాగేపల్లి నుంచి ఇల్లూరు వరకు కంకరతోలి వదిలేశారని తెలిపారు. ఆయా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. అలాగే గుమ్మేపల్లిలో ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పూర్తి చేయాలని, కమ్యూనిటీ హాల్, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.

ప్రజాఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదని డీపీఓ నాగరాజనాయుడు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ ప్రజా ఫిర్యాదులపై సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా బుక్కరాయసముద్రం మండల కేంద్రం పరిధిలోని నేసే వీధి, జనచైతన్య కాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సమస్యపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్య లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అమ్మవారిపేటలో కుక్కల దాడిలో నష్టపోయిన గొర్రెల కాపరుల వద్దకు వెళ్లి నష్టంపై ఆరా తీశారు. పశువైద్యుడి ద్వారా మేకల బీమా పథకం గురించి కాపరులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు వీధికుక్కల నుంచి గొర్రెల కాపరులకు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. దీంతోపాటు మండలంలోని స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను చేతపట్టుకొని స్వయాన పరిశీలించి వాటి పరిష్కారానిక సంబంధించి సిబ్బందికి దిశనిర్దేశం చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● 8న కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి: సీఐటీయూ

అనంతపురం క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే నగరపాలక సంస్థ కార్యాలయం ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హెచ్చరించారు. సీఐటియు ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. నగరంలో ప్రజలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. సకాలంలో కార్మికులందరికీ పనిముట్లు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ మంగళ, బుధ వారాల్లోనూ ధర్నా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ 8వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటారన్నారు. అనంతరం



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

డిప్యూటీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రంలో సీఐటీయూ పట్టణకార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, తిరుమలేష్, ముత్తురాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కనీస వేతన బోర్డు ఏర్పాటు చేయాలి

● కనీస వేతనం రూ.35 వేలివ్వాలి ● ఏఐటీయూసీ నాయకులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య/టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల కోసం చట్టప్రకారం కనీస వేతన బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఆందోళన పిలుపులో భాగంగా ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ముందుగా సంఘమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీగా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, నగర అధ్యక్షుడు రాజేష్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలో ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.35వేల వేతనం అవసరం అన్నారు. ఇదే విషయంపై ఇటీవల గోవాలో జరిగిన ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీలో తీర్మానం చేసినట్లు తెలిపారు. చాలా ప్రభుత్వ శాఖల్లో వేతనాల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. వెంటనే ఏపీలో వేతన బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు. అందరూ కార్మికులకు ఒకే తరహా వేతనం అందించాలన్నారు. కేంద్రంలో 8వ పీఆర్సీ రాష్ట్రంలో 12వ పీఆర్సీ కమిటీలు వేయాల్సి ఉందన్నారు. ఆలోగా ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నగర ప్రధానకార్యదర్శి కృష్ణుడు, ఇతర నేతలు రామకృష్ణ, మనోహర్, దుర్గాప్రసాద్, కృష్ణానాయక్, నారాయణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడుకు మార్కెట్ యార్డు తెస్తాం

● ఆటోనగర్‌లో కార్యాలయం: ఎమ్మెల్యే పరిటాల సునీత



మార్కెట్‌యార్డు పాలక వర్గ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గానికి త్వరలోనే మార్కెట్ యార్డును తీసుకొస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆమె సోమవారం నగరంలోని క్యాంపు కార్యాలయం లో రాప్తాడు మార్కెట్ యార్డు కమిటీ నూతన సభ్యులతో సమావేశం నిర్వహించారు. యార్డు చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ కృష్ణయ్యతో పాటు 15మంది డైరెక్టర్లు హాజరయ్యారు. వారు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం అనం తపురం మార్కెట్ యార్డు పరిధిలో పనిచేస్తున్నామని, త్వరలో మన నియోజకవర్గానికి యార్డు తీసుకొస్తామని చెప్పారు. ఇప్పటికే గొందిరె డ్డిపల్లి వద్ద 50 ఎకరాలు పరిశీలించామన్నారు. అది మంజూరైన వెంటనే అత్యాధునిక సదుపాయాలతో యార్డు ఏర్పాటు చేసుకుందామని చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో యార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, ఆటోనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కమిటీలో సగంమంది మహిళలకు అవకాశం దక్కిందన్నారు. అలాగే పార్టీ కోసం కష్టపడిన పలువురికి పదవులు వచ్చాయని, మిగిలిన వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ అందాలి

అనంతపురం రూరల్, మే5(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు సూచించారు. పథకం అమలుపై సోమవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు, మండల కన్వీనర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మండలాలు, రెవెన్యూ గ్రామాల వారీగా సమీక్ష చేశారు. ఎంతమందికి పీఎం కిసాన్ పథకం రాలేదన్న అంశంపై ఆరా తీశారు. గత ప్రభుత్వంలో రికార్డుల్లో తప్పిదాలు ఉన్నాయని..వాటిని సరిచేయాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందన్నారు. అర్హత ఉన్న ఏఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అందించడానికి ప్రభుత్వం సిద్ధమైందని, కౌలు రైతులకు కూడా పథకం వర్తిస్తుందన్నారు. త్వరలోనే పథకం అమలవుతుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో జాప్యం వద్దు

అనంతపురం రూరల్, మే5(ఆంధ్రజ్యోతి): రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్ మంజూరులో జాప్యంలేకుండా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సోమవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పపరిటాల శ్రీరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో రైతులు ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్లకు దరఖాస్తులు చేసుకున్నా రన్నారు. అవి త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో రైతుల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల సిబ్బంది వెంటనే స్పందించేలా చూడాలన్నారు. ఇదేసందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలోని రైతుల సమస్యలను పరిటాల శ్రీరామ్ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అనంతపురం టౌన్-1, 2 డీఈఈలు చంద్రశేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీల్లో

జిల్లా మహిళా జట్టుకు తృతీయ స్థానం



మంత్రి నాదెండ్ల నుంచి ట్రోఫీ అందుకుంటున్న బీచ్ కబడ్డీ జిల్లా మహిళా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా మహిళా జట్టుకు తృతీయ స్థానం దక్కింది. ఈ నెల 2నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో 12వ రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జట్టుపై ఒక్క పాయింట్ తేడాతో గెలుపొందిన జిల్లా మహిళా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా జిల్లా మహిళా జట్టు బహుమతి అందుకుంది. డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, సీఐ విశ్వనాథ్‌చౌదరి, శాప్ కోచ్ అనిల్‌కుమార్‌లు జిల్లా మహిళా కబడ్డీ జట్టును అభినందించారు.

స.హ. చట్టంపై వైద్య ఉద్యోగులకు అవగాహన

అనంతపురం టౌన్, మే 5ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండి బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి(డీఎంఓ) డాక్టరు ఓబులు సూచించారు. సమాచార హక్కు చట్టంపై సోమవారం జిల్లా కార్యాలయంలో వైద్య ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకొచ్చేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. అలాంటి చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్ఎల్‌సీ భూమిని ఆక్రమిస్తే చర్యలు : ఏఈ

నార్పల, మే5(ఆంధ్రజ్యోతి): హెచ్ఎల్‌సీకి ఇరువైపులా ఉన్న కాలువ భూమిని రైతులు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్ఎల్‌సీ ఏఈ శ్రీనివాసులు హెచ్చరించారు. హెచ్ఎల్‌సీ కాలువపై నార్పల మండంలంలోని 72వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 96వ డిస్ట్రిబ్యూటరీ సుబ్బరాయసాగర్ ప్రాజెక్ట్ వరకు దాదాపు 24కిలో మీటర్ల ఆయకట్టును ఏఈ సోమవారం సాగునీటి సంఘం అధ్యక్షుడు గవ్వల పరంధామతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ హెచ్ఎల్‌సీకి ఇరువైపులా ఉన్న కాలువభూమిని సమీపంలోని కొందరు రైతులు పలు చోట్ల ఆక్రమించినట్లు గుర్తించామన్నారు. వారంరోజుల్లోగా స్వచ్ఛందంగా ఆ భూమిని విడిచిపెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాలువకు కుడివైపు 8మీటర్లు, ఎడమవైపు 22 మీటర్ల స్థలం ఉందన్నారు.

ఏడాదిగా రోడ్డు మధ్యలో గుంత



కల్లుమడి-గుమ్మేపల్లి రోడ్డు మధ్యలో ఉన్న గుంత

శింగనమల, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి నుంచి గుమ్మేపల్లి వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న గుంతను పూడ్చకపోవ డంతో ప్రయాణికులు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారు. మండలం లోని కల్లుమడి నుంచి గుమ్మేపల్లికి వెళ్లే రోడ్డు మధ్యలో ఏడాది కిందట రెండు పెద్ద గుంత ఏర్పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటి వరకు వాటిని పూడ్చే ప్రయత్నాలు చేయలేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రయాణికులు, వాహన దారులు, గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో తరచూ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు మంత్రి కేశవ్‌కు ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న అర్చకులు

ఉరవకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు, అర్చకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆహ్వానం పలికారు. అనంతపురంలోని రాంనగర్‌లో సోమవారం ఆలయ ఈవో రమేష్‌బాబు, అర్చకుడు ద్వారకనాథాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ మారుతి తదితరులు మంత్రిని కలిసి, బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాలు, తీర్థప్రసాదాలను అంజేశారు. అనంతరం అర్చకులు మంత్రిని ఆశీర్వదించి, శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు.

మంత్రికి వినతి

ఉరవకొండ: మాదాసి కురువ, మాదారి కురువలకు కులపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మా కులం వెనుకబడి పోతోందని, కనుక న్యాయం చేయాలని ఏపీ మాదాసి కురువ, మాదారి కురువల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధయ్య మంత్రి కేశవ్‌ను కోరారు. అనంతపురం రాంగనగర్‌లో ఆయన మంత్రిని కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

మెగా జాబ్‌మేళా పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడ్ ఏపీ సమన్వయంతో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక తన నివాసంలో సోమవారం ఆయన వాటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల డిగ్రీ, బీటెక్ పూర్తయిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

రాయదుర్గం, మే 5(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ.. పట్టణంలోని మాజీ సైనిక ఉద్యోగులు, విశ్వహిందూపరిషత్, సనాతన హిందూ సేవా సమితి సభ్యులు కలిసి సోమవారం ర్యాలీ చేపట్టారు. పలు ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగించారు. ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున, మాజీ సైనిక ఉద్యోగులు అంజన్‌కుమార్, ఏపీఎస్ రెడ్డి, సనాతన హిందూ సేవాసమితి సభ్యుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జడ్‌వీరారెడ్డి కాలనీలో సుధాకర్ అనే వ్యక్తి మిద్దెపై నుంచి కిందపడి గాయపడ్డాడు. రోజూ మాదిరిగానే సుధాకర్ ఆదివారం రాత్రి ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. కాగా అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో ప్రమాదవశాత్తు నుంచి జారి కిందపడి గాయపడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ స్థలం పరిశీలన

పామిడి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని గుత్తి డిపో మేనేజర్ గంగాధర్ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బస్టాండ్ స్థలంలో అక్రమంగా వేసుకున్న షెడ్లు, బంకులను రెండు రోజుల్లో తొలగించుకోవాలని సూచించారు. లేకపోతే ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి: ఆర్డీఓ

కళ్యాణదుర్గం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రతి అధికారి కృషి చేయాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో పలువురు ప్రజలు వివిధ సమస్యలు కోరుతూ అందజేసిన వినతిపత్రాలను ఆర్డీఓ స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని ప్రజలు వినతుల ద్వారా తెలిపే ప్రతి సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు కృషి చేయాలని అన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు.

రోడ్డు వేయాలని నిరసన దీక్ష

కళ్యాణదుర్గం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం పట్టణం నుంచి కన్నేపల్లి వరకు బీటీ రోడ్డు వేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. పలువురు మాట్లాడుతూ.. కళ్యాణదుర్గం పట్టణం నుంచి కన్నేపల్లి వరకు 18 కిలోమీటర్ల ప్రయాణం చేయాలంటే ప్రజలు రోడ్డు లేక నరకయాతన పడుతున్నారని తెలిపారు. ఉన్న అరకొర దారిలో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దాదాపు 15 ఏళ్ల నుంచి రోడ్డు వేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.

కిశోరి వికాసం పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గం, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీ ఓ వసంతబాబు ఐసీడీఎస్ కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్న, రాయదుర్గం సీడీపీఓ పద్మక్క, కంబదూరు సీడీపీఓ రాధమ్మ కలిసి కిశోర వికాసం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల అభ్యున్నతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ నెల 2 నుంచి నుంచి ప్రారంభమైన కిశోరి వికాసం అవగాహన సదస్సులు జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. ఇందులో 11 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయడానికి ఆయా గ్రామాల అంగన్‌వాడీల కార్యకర్తల, ఆయాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా మండలాల ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో తాడిపత్రి పట్టణానికి చెందిన సాయిచైతన్య పాఠశాల విద్యార్థులు గౌతమి, సుహానా ప్రతిభ చూపారని కోచ్ లక్ష్మీనరసింహ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇరువురు విద్యార్థులు ప్రతిభను కనబరిచి అనంతపురం జట్టును మూడో స్థానంలో నిలిపారని చెప్పారు.

గండికోట నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుట్లూరు, మే 5(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరు మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి సాగు, తాగు నీరు ఇవ్వాలని టీడీపీ మండల నాయకుల కోరారు. ఈ మేరకు శింగనమలలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే 18గ్రామాలకు తాగునీరు, 32వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చునని తెలిపారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి మరోసారి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుపోయి చర్చిస్తామని తెలిపినట్లు ఆయన తెలిపారు.

బెట్టింగ్ వలలో యువత

తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి
ఐపీ పెడుతున్న ఉద్యోగులు
పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆనందం, ఆహ్లాదం కలిగించాల్సిన ఐపీఎల్ క్రికెట్‌ను కొందరు జూదంగా మార్చేశారు. ఈ వలలో చిక్కి అనేక మంది యువత పెడతోవ పడుతున్నారు. అత్యాశతో బెట్టింగ్ ఆడి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు సైతం ఐపీఎల్ దెబ్బతో ఆస్తులు పోగొట్టుకుని, చివరకు ఐపీ పెట్టి ఊరు విడిచిపెట్టిన దాఖలాలు ఉన్నాయి. ఐపీఎల్ మొదట్లో బెట్టింగ్‌లకు పాల్పడేవారు పక్కపక్కనే ఉండి డబ్బులు పంచుకొనేవారు. కానీ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మొబైల్ ఫోన్లలో పలు యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని బెట్టింగ్‌ను ఆడుతున్నారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ సులువుగా ఉండటంతో పలువురు విద్యార్థులు టీవీల ముందు కూర్చొని ఫోన్లలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.


డీఎస్పీ కార్యాలయం

బెట్టింగ్‌కు బానిసలుగా మారుతున్న యువకులు

సులువుగా డబ్బు సంపాదించాలన్న దురాశతో యువకులు బెట్టింగ్‌కు బానిసలుగా మారుతున్నారు. పట్టణంలోని టీస్టాల్స్, లాడ్జీలు, పట్టణ సమీపంలో నూతనంగా ఏర్పడ్డ టీకేఫ్‌లను వేదికలుగా ఎంచుకుంటున్నారు. కొందరు అయితే సేఫ్టీ కోసం గదులను అద్దెకు తీసుకొని బెట్టింగ్ ఆడుతున్నారు. తమ పిల్లలు ఎక్కడ బెట్టింగ్ ఆడి జీవితాలను నాశనం చేసుకుంటారోనని కొందరు తల్లిదండ్రులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లక్రితం జరిగిన ఐపీఎల్ సందర్భంగా ఓ ఉపాధ్యాయుడు తన వద్ద ఉన్న డబ్బులను మొత్తం బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా బంధువులు, స్నేహితులతో పాటు అందిన ప్రతిచోటా అధిక వడ్డీలకు అప్పులు చేసి బెట్టింగ్ ఆడాడు. అంతా పోగొట్టుకుని, రుణదాతల నుంచి ఒత్తిళ్లు రావడంతో రాత్రికి రాత్రి ఊరువిడిచి వెళ్లిపోయినట్లు సమాచారం.

బాల్ టు బాల్..

సాధారణంగా క్రికెట్ మ్యాచ్‌ల్లో ఓవర్ల ప్రకారం బెట్టింగ్‌లు జరుగుతుండేవి. ఈ ఐపీఎల్ మ్యాచ్‌ల్లో మాత్రం టాస్ నుంచి మ్యాచ్ ముగిసే వరకు బాల్ టూ బాల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రధాన జట్ల మధ్య మ్యాచ్ ఉంటే యువతకు అన్నం, ఇళ్లు కూడా గుర్తుకు రావు. ప్రధాన ఆటగాడు బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేస్తుంటే బెట్టింగ్ మొత్తానికి హద్దు లేకుండా ఉంటుంది. ఉదాహరణకు వంద రూపాయలు బెట్టింగ్ ఆడితే గెలిస్తే వంద రూపాయలు రెట్టింపు ఇచ్చేవారు. కానీ మ్యాచ్ ఆడే సమయంలో పరిస్థితులను బట్టి నిష్పత్తులు మారిపోతున్నాయి. ఒకటికి రెండు, ఒకటికి మూడు సైతం పెట్టడానికి వెనుకంజ వేయడం లేదు. తీవ్రంగా నష్టపోయిన యువకులు ఇంటిలో తల్లిదండ్రులకు తెలిస్తే మందలిస్తారన్న భయంతో కొందరు ఊరు వదిలి పారిపోతుండగా మరి కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యాడికితో పాటు రాయలచెరువులో ఐపీఎల్ బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. టీ కేఫ్‌లను వేదికలుగా చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. మండలకేంద్రంలో గతంలో ఒక ప్రజాప్రతినిధి కార్యాలయం వెనుక భాగాన ఉన్న వెంచర్‌లో యువత ఎక్కువగా చేరి డిన్నర్‌లు ఏర్పాటు చేసుకొని బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం. మరోవైపు రాయలచెరువులోని ఒక డాబా వద్ద యువకులు పెద్దఎత్తున చేరి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిసింది.


తాడిపత్రి పోలీస్‌స్టేషన్

నామమాత్రంగా దాడులు

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బెట్టింగ్ జోరందుకున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల జిల్లా పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించి తాడిపత్రి పోలీసులకు అప్పగించారు. వారు మరలా విచారించి మరో ముగ్గురిని కలిపి మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.4.2లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పట్టణంలో చాలాచోట్ల ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతున్నాయని, అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా: రోహిత్ కుమార్ చౌదరి, ఏఎస్పీ



ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఇప్పటికే లాడ్జీలు, టీకేఫ్‌లు తనిఖీలు చేయడంతోపాటు ప్రత్యేక నిఘా కూడా ఏర్పాటుచేశాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఎన్‌ఎంయూ


తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

తాడిపత్రి/ ఉరవకొండ/ రాయదుర్గం/ గుత్తి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) డిపో సెక్రటరీ ప్రతాప్‌నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడిపత్రి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన నాయకులు, ఆర్టీసీ కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఐదేళ్లుగా అనేక సమస్యలు పరిష్కారం కాలేదని, వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. అలాగేఉద్యోగ భద్రతా న ర్క్యూలర్‌ను అన్ని డిపోలలో అమలు పరచాలన్నారు. మహిళా సిబ్బంది ప్రత్యేక పరిస్థితులు అవసరమైనప్పుడు సెలవులు మంజూరు చేయాలని, రిటైర్డ్ అయిన సిబ్బందికి కనీస పింఛన్ లేని పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ, వృద్ధాప్యపింఛన్ అమలుచేయాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సెరెండర్ లీవులను ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. నాయకులు బాబు, రామకృష్ణ, నాగేశ్వరరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉరవకొండ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్‌ఎంయూ నాయకులు నారాయణస్వామి, ఓబులేశు, గ్యారేజీ సిబ్బంది నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాయదుర్గం: పట్టణంలోని ఎన్‌ఎంయూ నాయకులు కూడా తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. డిపో అధ్యక్షుడు జిలాన్, కార్యదర్శి తిప్పేస్వామి, జోనల్ ఉపాధ్యక్షుడు షఫి, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. గుత్తి పట్టణంలోని ఎన్‌ఎంయూ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందజేశారు. ఎన్‌ఎంయూ డిపో సెక్రెటరీ ఎన్‌వీ రాముడు, నాయకులు బాలప్రసాద్, మధు, హుసేనప్ప, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి

● మంత్రి కేశవ్‌కు దివ్యాంగుల వినతి



శెట్టూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కణేకల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ దివ్యాంగులు.. మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతపురంలోని రామ్‌నగర్‌లో సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్ మంత్రిని కలిసి మాట్లాడారు. గత 50 ఏళ్లుగా ఉమ్మడి జిల్లాలో పేదలకు అనేక సహాయ సహకారాలు అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ అయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు ఉద్దీప్‌సింహ, దొణస్వామి, చెన్నమల్లప్ప, శశి, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరులో ర్యాలీ

శెట్టూరు: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కోరుతూ మండలకేంద్రంలోని ఆ సంస్థ సిబ్బంది, స్థానికులు ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీని తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగించారు. ఫాదర్ ఫెర్రర్ చిత్రపటంతో ర్యాలీ జరిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు


రమేష్ (ఫైల్)

గుత్తి/గుత్తిరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని చెరువుకట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దవడూగురు మండలం అప్పేచర్ల తిమ్మాపురం గ్రామానికి చెందిన రమేష్ (41), తన వదిన భీమక్కతో కలిసి బైక్‌పై గుంతకల్లు నుంచి గుత్తికి బయలుదేరారు. చెరువుకట్ట సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డా రు. స్థానికులు వెంటనే వారిని గుత్తిప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గంమధ్యలో రమేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ నిరసన


కళ్యాణదుర్గం తహసీల్దార్‌కు వినతిని అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తాడిపత్రి/ గుత్తి/ రాయదుర్గం/ కళ్యాణదుర్గం రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పట్ల అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ తాడిపత్రి పట్టణంలోని ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా విద్యారంగంలో తీవ్ర సంక్షోభాలు నెలకొన్నాయన్నారు. గత ప్రభుత్వం 5రకాల బడుల విధానం ప్రవేశపెడితే ఈ ప్రభుత్వం 9రకాల బడులు విధానం తేవాలని చూస్తోందన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు. 2030నాటికి మొత్తం 30శాతం కన్నా మించకుండా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉండాలని ప్రపంచ బ్యాంక్ మన విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే కుట్రకు ప్రణాళికలు రూపొందిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే 11వ పీఆర్సీ బకాయిలతో పాటు అన్నిరకాల బకాయిలు చెల్లించాలని కోరారు. నిరసనలో జిల్లా కార్యదర్శి డేనియల్, మాజీ కార్యదర్శి రాందాస్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలాగే గుత్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బాషా, నాగరాజు, రామచంద్ర, కిరణ్, ఆదినారాయణ, ప్రదీప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాయదుర్గం పట్టణంలో కూడా ఏపీటీఎఫ్ నాయకులు ఎంఈఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. తర్వాత తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జోనల్ సెక్రటరీ రామాంజనేయులు, నాయకులు మోహన్‌రెడ్డి, పాండురంగ, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు. ఇక కళ్యాణదుర్గం పట్టణంలోనూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తర్వాత పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు భాస్కర్‌కు అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేశులు, ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, సీనియర్ నాయకుడు వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పుట్లూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 51ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నం చేసినట్లు సోమవారం ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. బాలిక బహిర్భూమికి వెళుతుండగా గమనించిన వెంకటరాయుడు అనే వ్యక్తి వెంటపడి అత్యాచారం చేయబోయాడు. బాలిక తప్పించుకుని వచ్చి విషయం తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై లైంగిక దాడికి యత్నం

పెద్దపప్పూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు సోమవారం లైంగిక దాడికి యత్నించాడు. ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పరుగున వచ్చారు. దీంతో వీరాంజనేయులు పరారయ్యాడు. తర్వాత గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వీరాంజనేయులును అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మహిళా సాధికారత దినోత్సవం

తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇన్నర్‌వీల్‌క్లబ్ కార్యాలయంలో సోమవారం మహిళా సాధికారత, కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి అనిల్‌కుమార్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

93 నీటి తొట్టెలు మంజూరు

బెళుగుప్ప, మే 5(ఆంధ్రజ్యోతి): మూగ జీవాల కోసం మండలానికి 93 తాగునీటి తొట్టెలు మంజూరైనట్లు ఉపాధి ఏపీవో మురళి సోమవారం తెలిపారు. వాటిలో ఇప్పటికే 37 తొట్టెలు నిర్మించామన్నారు. మిగిలిన వాటిని ఈనెల15లోపు నిర్మిస్తామని పేర్కొన్నారు.

ఫయాజ్ ఇంటి కొలతలపై విచారణ

తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నబజారులో వైసీపీ నేత ఫయాజ్‌బాషా ఇంటిని అక్రమంగా నిర్మించారని గతంలో మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. తొలగించాలని 20రోజులక్రితం మున్సిపల్ అధికారులు, చైర్మన్ ఆ ఇంటిని సైతం ముట్టడించారు. అప్పుడు పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పి పంపించారు. కాగా సోమవారం మరోసారి ఆ ఇంటికి కొలతలు వేయడానికి మున్సిపల్, రెవెన్యూ అధికారులు వెళ్లారు. అక్కడ ఫయాజ్ లేకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించి వెనుదిరిగారు.

పది మందిని కరిచిన పిచ్చికుక్క

పుట్లూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో ఆదివారం రాత్రి పిచ్చికుక్క దాడిలో 10మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరికి తీవ్రగాయాలు కాగా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దేవాన్ష్ అనే నాలుగేళ్ల బాలుడికి కుడికన్ను, తలకు, వీపుపై కరవడంతో బలమైన గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అలాగే ఎల్లమ్మ, అంకన్న, నారాయణస్వామి, హరి, నరేంద్రతోపాటు మరో ముగ్గురు మహిళలను కుక్క కరిచింది.

మజ్జిగ పంపిణీ

బొమ్మనహాళ్, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం తహశీల్దార్ మునివేలు, టీడీపీ నాయకుడు, కొత్తపల్లి మల్లికార్జున, జడ్పీటీసీ మాజీ సభ్యులు వాణి జగన్నాథ్‌రెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. స్టోర్ డీలర్ సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, టీడీపీ నేత పయ్యావుల నాగరాజు, నేమకల్లు సర్పంచ్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

లచ్చానిపల్లిలో చోరీ

గుత్తిరూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): లచ్చానిపల్లిలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రమేష్ ఉదయమే ఇంటికి తాళాలు వేసి బయటికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో తిరిగి రాగా.. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే లోపలికి వెళ్లి చూడగా.. బీరువా కూడా తెరచి ఉంది. అందులోని 3 తులాల బంగారం చైను కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గ్రహించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం షాపులో..

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో గల ఎస్వీఎస్ మద్యం షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు దుకాణం పైకప్పునకు రంధ్రం వేసి లోపలికి చొరబడ్డారు. అక్కడ ఉన్న రూ. 50వేలు విలువ చేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి: ఏఐఎస్ఎఫ్

కళ్యాణదుర్గం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఇంకా విద్యాసంవత్సరం కాకమునుపే.. పట్టణంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నాయని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ వసంతబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పవన్, ఉపాధ్యక్షుడు బాలుసాయి, సహాయ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జేసీపీఆర్ పర్యటన

తాడిపత్రి, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్‌స్టేషన్, గాంధీ కట్ట, సీబీరోడ్డు ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల వద్ద వాహనాలు పార్కింగ్ సరిగా ఉండేవిధంగా దుకాణాల యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త చెదారం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని దుకాణదారులకు సూచించారు.

బియ్యం తూకాల్లో తేడాలొస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి స్పందన

యాడికి, మే 5(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తూకాల్లో తేడాలు వస్తే కేసులు నమోదు చేస్తామని ఎండీయూ ఆపరేటర్లను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. రేషన్ షాపుల్లో బియ్యం కొలతల్లో తేడాపై గత ఆదివారం ఆంధ్రజ్యోతిలో డబ్బా కథ... చౌక దుకాణాల్లో బియ్యం దోపిడీ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన తహసీల్దార్ సోమవారం తన కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీలో లబ్ధిదారులకు కచ్చితమైన తూకాలు ఇవ్వాలని తెలిపారు. డబ్బాతో తూకాలు వేస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఇక నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయడంతో పాటు డీలర్‌షిప్‌ను రద్దు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఎస్‌డీటీ సూర్యనారాయణ ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

గుంతకల్లు టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్‌రోడ్డులో గల బేకరీల్లో, హోటళ్లలో, కిరాణా దుకాణాలలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో 120 మైక్రాన్ తక్కువగా ఉన్న 150 కేజీల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని మున్సిపల్ సిబ్బంది దహనం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.